క్లుప్తంగా

చేతులు పరిశుభ్రతపై అవగాహన

క్రోసూరు: చేతులు పరిశుభ్రతపై అన్ని పంచాయతీల్లో అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో బి.మహేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అంతర్జాతీయ చేతులు పరిశుభ్రత దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. భోజనానికి ముందు, తర్వాత, మల విసర్జన తదుపరి చేతులను అర నిమిషం పాటు పరిశుభ్రపరుచుకోవాలని చెప్పారు. దీంతో అనేక రకాల జబ్బుల నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చునన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరు యాత్ర

మాదల(ముప్పాళ్ళ): ప్రజా సమస్యల పరిష్కారానికి మాదల గ్రామంలో సీపీఎం నాయకులు పోరు యాత్ర ఆదివారం నిర్వహించారు. కాలనీలో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు. గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాల కృష్ణ, గారా జాలయ్య, పఠాన్ సైదా ఖాన్, చింతపల్లి నాగ మల్లేశ్వరరావు, తోట బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు కట్టమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కట్టమూరు గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఇంటింటికీ పర్యటించి, సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి ఎమ్మెల్యే నంబూరు పరామర్శ



క్రోసూరు: అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలాను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ భర్త షేక్ గఫూర్ , వైఎస్సార్ సీపీ నాయకులు గల్లాగురుపాదం ఉన్నారు. అలాగే.. రూ.149 కోట్లతో అమరావతి– బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా.. ఊటుకూరు గ్రామంలో సీసీరోడ్డు, డ్రైయిన్లను ఎమ్మెల్యే నంబూరు పరిశీలించారు. పనులు పూర్తినాణ్యతగా ఉండాలని, ఆర్అండ్బీ శాఖ అధికారులతో మాట్లాడారు. మండలంలోని హసనాబాద్ సర్పంచ్ కేశబోయిన వీరయ్య ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరు కానున్నట్లు నాయకులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కంటూ



సత్తెనపల్లి: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కంకణాల పల్లి గ్రామానికి చెందిన కంటూ వెంకట్రామయ్యను, కార్యదర్శిగా గోగులపాడుకి చెందిన గుంజి విజయకుమార్‌ను నియమించారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యామా మురళి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బీసీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో నియోజకవర్గంలోని బీసీల సమస్యలపై చర్చించారు. విశిష్ట అతిథిగా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను పాల్గొని, మాట్లాడారు. బీసీలందరూ ఐక్యంగా ఉంటూ విద్యా, వ్యాపార, రాజకీయ రంగాల్లో అగ్రగాములుగా ఎదగాలని ఆకాంక్షించారు. నూతన జిల్లా కమిటీకి ఎంపికైన కంటూ వెంకట్రామయ్య, గుంజి విజయకుమార్ మాట్లాడుతూ... బాధ్యతతో పని చేస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవింద్, తుళ్లూరి శివరామకృష్ణ గౌడ్, యరగొర్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, కుమ్మరి దస్తగిరి, చామర్తి ఆంజనేయులు, పరమేశ్వరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

బొల్లాపల్లి: మండలంలోని చక్రాయపాలెం సచివాలయం పరిధిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా తెలిపారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత మండల కేంద్రంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ఉంటుందన్నారు.

జగన్మాతా.. పాహిమాం



సత్తెనపల్లిలో బాల త్రిపుర సుందరిగా వాసవీ మాత



అచ్చంపేటలోని అన్నపూర్ణాదేవిగా వాసవీ మాత



లంకెలకూరపాడులో స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవి అలంకరణ



బాలత్రిపుర సుందరిదేవీగా వాసవీ అమ్మవారు

- ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు
- ఆలయాలకు పోటెత్తిన భక్త జనం

సత్తెనపల్లి: దేవి శరన్నవ రాత్రులను పురస్కరించుకొని ఆదివారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, త్రి శక్తి దుర్గా పీఠం, మేదర రామాలయం వద్ద బాల త్రిపుర సుందరిగా, శ్రీ సనారి వీర బ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని నీలంపాటి లక్ష్మీ అమ్మవారి పీఠంలో స్వర్ణ, రజిత కవచలంకృతగా, మహాలక్ష్మమ్మ చెట్టు, వడ్డవల్లి పోలేరమ్మ గుడిలో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరణ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముప్పాళ్ళ: దేవీ శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మండలంలోని లంకెలకూరపాడు, ముప్పాళ్ళ, దమ్మాలపాడు, నార్నెపాడు, మాదల గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బాలత్రిపుర సుందరిగా వాసవీ అమ్మవారు

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆదివారం బాలత్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు చుండూరి సత్యనారాయణ దంపతులు చీరను బహూకరించారు. దేవస్థానంలో ఉదయం అఖండ దీపారధన, మారం జగదీష్‌కుమార్, లీలా నాగలక్ష్మి దంపతులు దేవీ కలశ స్థాపన, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. బతుకమ్మ ఉత్సవ భజన కార్యక్రమం ఘనంగా చేపట్టారు.

ఘనంగా దేవీ నవరాత్రి వేడుకలు

నకరికల్లు: చేజర్లలోని కపోతేశ్వర స్వామి ఆలయం , నర్సింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు భక్తులకు బాల త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అచ్చంపేట:మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అన్నపూర్ణగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు సూరే సుబ్బారావు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా విభాగం సహస్ర, అష్టోత్తర శతనామ పారాయణం నిర్వహించింది. సీతారామస్వామి దేవాలయంలో సీతామహా లక్ష్మి అమ్మవారు భక్తులకు ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చారు. బతుకమ్మలను ప్రతిష్ఠించి, మహిళలు ఆట పాటలతో అలరించారు.

అంకమ్మతల్లి ఆలయంలో..

రాజుపాలెం: స్థానిక అంకమ్మ తల్లి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కోటినారాయణ, అరవపల్లి ఫణికేశవశర్మ విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

బాల త్రిపుర సుందరి అలంకరణలో మహాలక్ష్మి

బెల్లంకొండ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు బెల్లంకొండ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి దేవి నిలయంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు పి.వెంకట ఫణికుమార శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. రోజుకో అలంకరణలో అమ్మవారు 23వ తేది వరకూ దర్శనమిస్తారని ఫణికుమార శర్మ తెలిపారు.



నర్సింగపాడులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



విశేష అలంకరణలో అంకమ్మతల్లి



సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో స్వర్ణ కవచలంకృత అలంకరణ



బాల త్రిపుర సుందరిగా మహాలక్ష్మి దర్శనం అమ్మవారు

ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం



దొడ్లేరు(క్రోసూరు): ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై రైతుల్లో అవగాహన పెరిగిందని సంబోధిని సంస్థ బృందం సూపర్ వైజర్ ఎస్.నవీన్ అన్నారు. 2020 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న దొడ్లేరు, బయ్యవరం గ్రామాల్లోని రైతులతో ఆదివారం సంస్థ ప్రతినిధులు మాట్లాడి, వారి పంట పొలాలను సందర్శించారు. గ్రామానికి 20 మంది రైతులను ఎంపిక చేసి, సాగులో వారు పాటించిన పద్ధతులను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పృథ్వీరాజ్, రామలక్ష్మి, లావణ్య, రాధిక, ప్రకృతి వ్యవసాయం శిక్షకుడు సైదయ్య, హాజరాబీ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జీవీ మాధవరావు ఆఫీస్ నందు వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు చింతలచెర్వు రాఘవేంద్రరావు, మల్లికార్జున శాస్త్రి, గోపాలుని నరసింహారావు, కె.శివరామారావు, పి. రవికుమార్‌ల సహకారాలతో బియ్యం, చీరెలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా సహాయసహకారాలు అందిస్తు న్న డి.ఆదిచంద్రశేఖర శాస్త్రి, జి. నాగరాజు, ఎం .మురళీధర్, పి.వరలక్ష్మమ్మలకు మెమోంటో, శాలువాతో సన్మానించారు. కార్య క్రమంలో ఎ.నాగేశ్వరరావు ఎ.వెంకటేశ్వరరావు, పి. సుబ్బారావు, డి.నాగేశ్వరరావు, జె.చంద్రమౌళేశ్వరరావు, సీహెచ్. భద్రయ్య, సీహెచ్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

శావల్యాపురం: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన నలు దిక్కులను కవర్ అయ్యేలా ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తుమ్మురి తిరుపతిరావు తెలిపారు. ఆదివారం సీసీ కెమెరాలు పనితీరు స్వయంగా ఎస్సై తిరుపతిరావు పరిశీలించి వ్యాపార సంస్థల నిర్వాహకులకు వివరించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు.

నేటి తరానికి ఆదర్శనీయం.. అబ్దుల్ కలాం



సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళి



రైల్వేస్టేషన్ రోడ్డులో కలాం విగ్రహానికి ఎస్వీబీసీ



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి

సత్తెనపల్లి : మిస్సైల్ మెన్ గా పేరు గడించిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేటి తరానికి ఆయన ఆదర్శనీయుడని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆదివారం కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. చల్లంచర్ల మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేపర్ బాయ్‌గా ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్రపతిగా ఎదిగారన్నారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ముస్లిం నాయకులు షేక్ జానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

■ స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఘనంగా నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్, జేపీఎస్ శాస్త్రి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

■ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కట్టా శంకరరావు, జేపీఎస్ శాస్త్రి, రాష్ట్ర నాయకులు పి.రవిశంకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కందకట్ల శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి కమలాకర్ తదితరులున్నారు.

■ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. వసతి గృహ సంక్షేమ అధికారిణి పి.రాణిమ్మ, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సోమ శేఖర్, సురేష్, రవి కిరణ్ పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

సత్తెనపల్లి: కలాం చేయూత సంస్థ వ్యవస్థాపకుడు వెలుగూరి శరత్ ఆదివారం పట్టణంలోని 6వ వార్డుకు చెందిన దివ్యాంగ మహిళ షేక్ బీబీకి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబ శివరావు చేతుల మీదుగా ట్రై సైకిల్ అందజేశారు.

కలలను సాకారం చేసుకోవాలి

క్రోసూరు: ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు కలల కనాలని, వాటిని సాకారం చేసుకొనే విధంగా ముందుకు సాగాలని భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే డాక్టర్ అబ్దుల్‌కలాం అన్నారని శ్యాం మిత్ర మండలి గౌరవ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ అన్నారు. ఆదివారం క్రోసూరులోని బీసీ కాలేజ్ విద్యార్థుల హాస్టల్‌లో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎం.అనిల్, వై.భానుకు హాస్టల్ వార్డెన్ రత్తయ్య అందజేశారు. స్థానికులు పందిటి పేరయ్య, షేక్ మస్తాన్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువత రక్తదానం

నకరికల్లు: భారతరత్న, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్.హరీష్ బాబు అన్నారు. గుండ్లపల్లి గ్రామంలో ది.గుండ్లపల్లి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. సుమారు 105 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డీఆర్‌వో వినాయకం, ఆర్ఎంఓ దయానిధి, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు చందా మీరా, కార్యదర్శి హిమాం వలి, కమిటీ సభ్యులు, స్వచ్ఛాంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ గౌస్ పీరా



అధ్యక్షుడు మహ్మద్ గౌస్ పీరా, ఉపాధ్యక్షుడు షేక్ సర్దార్

నిజాంపట్నం: అంజుమన్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మహ్మద్ గౌస్ పీరా, షేక్ సర్దార్ (మేస్త్రీ) ఎన్నికయ్యారు. నిజాంపట్నం అంజుమన్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక షాదీ ఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ గౌస్ పీరా మాట్లాడుతూ ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎంపీటీసీ నాజర్‌ఖాన్, తాజుద్దీన్, ఫరూక్, జాన్ సైదా తదితరులు అభినందించారు.

శాకంబరిగా లక్ష్మీ అమ్మవారు



దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఈ నెల 23 వరకు అమ్మవారికి వివిధ అలంకారాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

షాపు వర్కర్స్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం ఎదురుగా నూతనంగా నిర్మించిన నరసరావుపేట షాపు వర్కర్స్ యూనియన్ నూతన కార్యాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, ఆర్యవైశ్య ప్రముఖులు పూరా భాస్కరరావు, కొత్తూరి కిషోర్‌బాబు, జల్లి శ్రీనివాసరావు, దివ్వెల రామకృష్ణ, ఆత్మకూరి రాజేంద్రప్రసాదరావులు హాజరయ్యారు. భవన నిర్మాణానికి గుండా సాంబశివరావు సహకరించారు. షాపు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంభంపాటి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు నలమోలు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాచమడుగు సుబ్బారావు, కోశాధికారి నోముల శివశంకరరావు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే దేవత కనకదుర్గమ్మ



పూజలో పాల్గొన్న పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

గుంటూరు రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే దేవత శ్రీ కనకదుర్గమ్మ అని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన్నపలకలూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, మిర్చియార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వరరావు(ఇంద్ర) ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం సంతోషకరమని అభినందించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయంలో భక్తులు మొక్కుబడు లు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానది లో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజలో పాల్గొన్నారు. అనంతరం దేవాల య ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ వారి సహకారంతో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 75 మందిని ఆపరేషన్ నిమిత్తం నంద్యాల తీసుకెళ్లినట్లు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్ళజోళ్ళు అందజేస్తారన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్, చుండూరు సత్యనారాయణ, నేరెళ్ళ నాగేశ్వరరావు, అర్జున్‌రావు, వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజుమాన్ షాదీఖానాలో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, శంకర్‌కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంకు అనూహ్యస్పందన లభించింది. శిబిరాన్ని పట్టణ ఆర్థోపెడిక్ వైద్యులు రావిపాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మొత్తం 360 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నిర్వహించారు. అనంతరం 168 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సల నిమిత్తం పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పొలాల్లో ఏర్పాటు చేసిన 16 కె.వి. సామర్థ్యం కల్గిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులో కాపర్, రాగి తీగ చోరీ చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని నుంచి పరిటాలవారిపాలెం వెళ్లే రహదారి మార్గంలో పొలుట్ల పవన్ కుమార్‌కు చెందిన సాగు భూమిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులోని విలువైన సామగ్రిని చోరీ చేశారు. రూ. 2 లక్షల విలువ చేయు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలికొట్టి అందులో విలువైన విద్యుత్ సామాగ్రి చోరీ చేసినట్లు విద్యుత్ ఏఈ సంపెంగుల గాంధీ వెల్లడించారు.